# మృత్యోర్మా...

చంద్రశేఖర్ ఆజాద్

ఊరికి ఉత్తరంగా నరసింహస్వామి గుట్ట - గుట్టపాదాలను పలుచగా తాకుతూ నిశ్శబ్దంగా నిద్రిస్తుంది గోదావరి!

గుట్టమీద స్వామిని చేరడానికి సర్వాకారంలో 'మెట్లు - మెట్లను పహరా కాస్తున్న ట్యూబ్‌లైట్లు!

కటకటాల తలుపుల వెనుక కళ్లు తెరిచే నిద్రిస్తున్నాడు స్వామి - తలుపు ముందు మత్తుగా నిద్రిస్తుంది కుక్క!

*

నీ గదిలో గోడగడియారం మూడుసార్లు మోగింది, గది మూలన ఎక్వేరియంలోని ఒకే ఒక్క బంగారు చేప పదే పదే గాజు అద్దాన్ని ముద్దుపెట్టుకుంది... యూఫోం బెడ్డుమీద నుంచి లేచి - డ్రెస్సింగ్ టేబుల్ ముందు కొచ్చి - అద్దంలో నిలువెత్తు నీ విగ్రహాన్ని చూస్తూ నిలబడ్డావు - నీ కళ్ళల్లో ఏ భావమూ లేదు. నిండైన నీ రొమ్ముల మధ్య ముద్దుగా పడి వుంది తాళిబొట్టు గొలుసుకు వేలాడుతూ - తలంటు స్నానం చేసి, తుడుచుకోకుండా వచ్చి, తిరిగి డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిల్చోని అద్దంలో నిన్ను నీవు పరీక్షగా చూడ సాగావు. పైన సీలింగ్‌ఫేన్ గాలికి నెమ్మదిగా నీ వొంటిమీది తడి ఆరిపోయింది.

ఎరుపురంగు చీర, ఎర్రని బ్లౌజు వేసికొని, నుదిటిన ఎర్రన కుంకుమ దిద్దుకున్నావు. నీ చేతి గాజులు కూడా ఎరుపురంగే.

కుడిచేతిలోకి తాళిబొట్టును తీసికొని పరీక్షగా చూడ సాగావు. సంవత్సరం క్రితం సరిగ్గా ఇదే రోజు, ఇదే సమయానికి - నీ మెడలో ఈ గొలుసు కట్టబడింది కదూ!

నెమ్మదిగా నడిచి ఎక్వేరియం దగ్గరకు వచ్చి నిలబడ్డావు. అయోమయంగా అటూ ఇటూ తిరగసాగింది బంగారు చేప. అంత పెద్ద ఎక్వేరియంలో అదొక్కటే - అన్నట్లు, నీ శోభనం జరిగిన మరునాడు కదూ! నీవే స్వయంగా కొనుక్కొచ్చి ఆ ఎక్వేరియాన్ని అక్కడ వుంచింది?

ఎక్వేరియం అడుగున మూలగా వున్న చిన్నటి రంధ్రాన్ని బిగించిన బిరడాను లాగిపారేశావు. చాలా సన్నగా, ధారగా, నీళ్లు క్రింద పడసాగాయి. వొంగి అద్దాన్ని ముద్దుపెట్టుకున్నావు. నీ కళ్లనుంచి జారిన రెండు చుక్కలు క్రింద నీటిలో కలిసాయి.

టేబుల్‌పైన వున్న హారతి పళ్లెం చేతిలోకి తీసుకున్నావు. పళ్లెంలో కావలసినవన్నీ వున్నాయి. కొబ్బరి కాయ, కుంకుమ, అగరొత్తులు, అగ్గిపెట్టె, కొద్దిగా మంచినీళ్ళు. గదిని ఒక్కసారి కలయచూసి, బయటకు వచ్చి, తలుపు దగ్గరకి తీసికొని, నెమ్మదిగా మెట్లు దిగసాగావు.

గోదావరి అంచున కూర్చుని కాళ్ళకు పసుపు రాసుకున్నావు. చేతుల కడుక్కుని, నుంచొని, రెండు చేతులూ జోడించి, గోదావరికి మనస్ఫూర్తిగా దండం పెట్టావు. వొంగి, కుడి అరచేతిలో కాసిని నీళ్లు తీసికొని తీర్థంగా నోట్లో పోసికున్నావు. వెనక్కి తిరిగి నెమ్మదిగా గుడిమెట్లకేసి వడవసాగావు. మొట్టమొదటి మెట్టుపై "కుడిపాదం" మోపావు......

**     **     **

.........కుడిపాదం మోపి మొదటిసారి మెట్టినింట్లో అడుగుపెట్టావు కదూ - నీ పెనిమిటి చిటికిన వేలు పట్టుకుని.

"పైసా కట్నం లేకుండా పది లక్షల ఆస్థి వున్న మొగుణ్ణి కట్టుకుంది. ఊరికే అన్నారా? పుణ్యం కొద్దీ పురుషుడనీ-"

"ఏం చూసి యీ ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టర్ పెళ్లాడాడో ఈమెను? మా బావగారి అమ్మాయిని రెండు లక్షలు కట్నం ఇస్తామంటే వద్దన్నాడు. ఏదైనా నుదుటిన రాసి వుండాలి."

"చదువుకున్న పిల్ల గదా. ప్రేమించి పెళ్లి చేసుకున్నాడేమో..."

"అదేం లేదు. వీళ్ల ఫ్రెండు పెళ్లిలో ఈమెను చూశాడంట. ఇంటికెళ్లి వాళ్ల నాన్నగారిని అడిగాడంట. అంతే-"

అమ్మలక్కల గుసగుసలు విని నీ గుండె ఎంతగా ఉప్పొంగిపోయిందో ఆ నాడు. మీ నాన్నగారు తరుచు అంటూండేవారు కదూ. "నీవు అదృష్టజాతకురాలవు తల్లీ. బంగారంలాటి మొగుడిని ముడివేసికుంటావు."

సిగ్గుతో నీ బుగ్గలు చిన్నగా వణికాయి.

జీరోవాట్ బల్బు వెలుగులో యూఫోం బెడ్‌మీద గులాబీరంగు బ్లాంకెట్‌పై విచ్చిన మల్లెల మధ్య చవిచూడబోయే అనుభవం తాలూకూ అనుభూతితో, అర్థంకాని సన్నని భయంతో వెల్లకిలా పడుకొని నీ పెనిమిటి రాకకై ఎదురు చూస్తున్నావు. ఎదురు చూస్తూ అలానే నిద్దురపోయావు.

నీ మొహం మీద ఒక్కసారిగా పడిన బరువుతో ఉలిక్కిపడి కళ్లు తెరిచి భయంతో కేక వెయ్యబోయావు. నీ నోటిని అతని నోరు మూసింది. గుప్పున వాసన కొట్టింది. నీ కడుపులో ఒక్కసారి తెమిలింది. నీ వొళ్లంతా చెమటలు పట్టాయి. నీకు తెలియదు నీ కంటి నీరు దిండును తడిపిన సంగతి.

"నీకు నేను ఎన్నోవాడిని?" నీ పెనిమిటి మొదటి ప్రశ్న.

మొదట అర్థం కాలేదు. అర్థం ఐన తర్వాత నీవేమిటో నీకే అర్థం కాలేదు. గుండెల్లో కసుక్కున సూదిని గుచ్చిన బాధ.

"ఇంత అందమైనదానవు. ఇంతవరకు విన్నెవరూ నలపలేదంటే నమ్మే వెధవను కాను." ఏదేదో చేస్తూ, ఎక్కడెక్కడో తడుముతూ, ముద్దముద్దగా అంటున్నాడు. అచేతనంగా పడి వున్నావు నీవు.

టి.యస్. ఇలియట్ 'ది వేస్ట్ లాండ్'లో 'టైపిస్ట్ గరల్' గుర్తొచ్చింది నీకు. 'కార్బం క్యులర్‌ఫెలో'నే నయమేమో వీడికంటే.

పది నిముషాల తర్వాత నిద్దురపోయాడు. నిద్దుర ఎలా వుంటుందో ఆ క్షణమే మర్చిపోయావు నీవు. నిన్ను సాగనంపుతూ మీ నాన్నగారు చెప్పిన మాటలు నీకు వినపడుతున్నాయి.

"ఇది పితృస్వామ్య యుగం తల్లీ - మగవానికి జన్మతః వస్తుంది అహంకారం. బలహీనతలే అహంకారానికి మూలం. జీవితమంటే సర్దుకుపోవడమే. కాదని ఎదిరిస్తే పెనంమీద నుంచి పొయ్యిలోకి పడినట్లవుతుంది. చదువుకున్నదానవు. అర్థం చేసికో తల్లీ - ఎందుకు చెపుతున్నానో."

**     **     **

గర్భగుడి ముందు నిలబడ్డావు. నిద్ర లేచిన కుక్క, క్షణంపాటు నిన్ను చూసి, తిరిగి ముడుచుకుంది.

స్వామి వెనుక గోడన అక్కడక్కడా సాలెపురుగు గూడులు. గూళ్లలో చిక్కుకుని చచ్చిన పురుగులు. తనకు సంబంధం లేదన్నట్లు కళ్లు తెరిచే నిద్దురపోతున్నాడు స్వామి.

తలవంచి రెండు చేతులు జోడించి స్వామికి దణ్ణం పెట్టుకున్నావు. కుడిచేతిని పైకెత్తి గంటను మూడుసార్లు మోగించావు.

ఉలిక్కిపడి లేచిన కుక్క స్తంభం ప్రక్కకు వెళ్లి

తిరిగి పడుకుంది. తిరిగి రెండు చేతులూ జోడించి కళ్లు మూసుకున్నావు. కళ్లు తెరిచి 'తదేకంగా' స్వామిని చూడసాగావు.

** ** **

"ఏమిటి కిటికీలోంచి తదేకంగా బజారులోకి చూస్తున్నావు. ఎవడిని?"

ఉలిక్కిపడి వెనక్కి తిరిగావు. విడిచిన షర్టును హేంగర్‌కు తగిలిస్తూ నీ పెనిమిటి-

మౌనంగా నిలబడ్డావు నీవు.

"వెళ్లయిందగ్గరనుంచి చూస్తున్నాను. ఒక్క మాటా లేదు. ఒక్క నవ్వూ లేదు. ఇంతకన్నా మూగి మొద్దును కట్టుకున్నా సుఖపడేవాడిని. ఎవడినో ప్రేమించి వుంటావు. వాడు మోసం చేసి పోయి వుంటాడు. నా ఖర్మ కొద్దీ నా కంట పడ్డావు. అసలు..."

లోపలికెళ్లిపోయావు నీవు.

పది నిముషాలతర్వాత కాఫీ తీసికొని క్రింది వరండా లోకి వచ్చావు. అతను మరెవ్వరితోనో మాట్లాడుతున్నాడు. వెనక్కి తిరిగావు నీవు.

"వెళుతున్నావేం? రా! ఫర్వాలేదు. వీడు నా క్లాస్ మేట్ రమేష్. ఇక్కడ గవర్నమెంట్ హాస్పిటల్‌కు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. వీడికి మంచి ఇల్లు దొరికిందాకా ప్రస్తుతం మనింట్లోనే వుంటాడు. వీడికి కావలసిన ఏర్పాట్లన్నీ దగ్గరుండి చెయ్యి. ఈమె నా మిసెస్ రాధ. బి.ఎ. లిటరేచర్." పరిచయం చేశాడు.

కాఫీ కప్పును అతని చేతికి అందించావు. అందించేప్పుడు నీ చేతివేళ్లు అతని చేతివేళ్లకు తగులుతాయేమోనని పరీక్షగా నీ పెనిమిటి చూసిన సంగతి నీకు తెలియదు.

"వీడు ప్రతి సంవత్సరం మిస్టర్ కాలేజీగా వచ్చేవాడు. ఆడపిల్లలంతా వీడంటే పడి చచ్చేవారు. అన్నట్టు ఎంతమంది పిల్లలురా నీకు?"

నీ మొహం చూస్తూ అతన్నడిగాడు.

"ఒక ప్లస్ - ఒక మైనస్" అతని సమాధానం అసహ్యం వేసింది నీకు. వెనక్కు తిరిగి లోపలకు వెళ్లావు నీవు.

"రమేష్ భోం చేశాడా?" రాత్రి పన్నెండింటికి వచ్చి, పాలు త్రాగుతూ అడిగాడు.

తల ఊపావు నీవు.

"ఎవరు వడ్డించారు?"

నేనే అన్నట్లు తలవూపావు.

"నీవు, వాడు కలిసి భోంచేశారా?"

లేదన్నట్లు తలాడించావు.

"ఏం? కలిసి భోం చెయ్యకపొయ్యారా?"

కిటికీ దగ్గరగా నడిచి బయటకు చూడసాగావు.

"ఈ సిగరెట్ ముక్క ఇక్కడికెలా వచ్చింది?" గోడకు మూలనున్న సిగరెట్‌ని కాలుతో లాగుతూ అడిగాడు.

నీవేమీ మాట్లాడలేదు.

"రమేష్ ఈ గదిలోకి వచ్చాడా?"

అవునన్నట్లు తలఊపావు.

"ఎందుకు?"



తనకవసరమైన మేగజైన్ తీసికోడానికి ఈ గదిలోకి వచ్చాడని చెపుదామనుకున్న నీ సమాధానం అనవసరమని మౌనంగా వున్నావు.

"ఈ పక్క నలిగిందేం?"

నీవేమీ మాట్లాడలేదు.ఎక్వేరియంలోని బంగారు చేపను చూస్తూ నిలబడ్డావు.

** **

......కొబ్బరికాయకు కుంకుమ అద్ది, రెండు చేతుల మధ్య వుంచి స్వామికి దణ్ణం పెట్టావు. వొంగి బలంగా కొబ్బరికాయను కొట్టావు. నాలుగు ముక్కలైంది. శబ్దానికి కుక్క లేచి నిలబడింది. అరచేతిలో గుచ్చుకున్న కొబ్బరిపెంకు "నీ రక్తాన్ని" రుచి చూడసాగింది.

** ** **



"ఏమిటి? వాంతి చేసుకుంటున్నావు? నెల తప్పిందా?" మంచం మీద వెల్లెలికిలా పడుకుని అడిగాడు.

నోరు కడుక్కుని బాత్‌రూం నుంచి నెమ్మదిగా వచ్చావు.

"ఎన్నో నెల?"

మూడుసార్లు మ్రోగింది గోడ గడియారం.

తలెత్తి గడియారంవైపు చూశావు.

"రమేష్ ఈ ఊరొచ్చి మూడునెల్లైంది." సిగరెట్ పొగ ఊదుతూ అన్నాడు.

సమాధానం ఇవ్వడం ఏ రోజో మానివేశావు.

"కాస్త మంచి నీళ్ల తీసుకురా."

గాజుగ్లాసునిండా నీళ్ల తెచ్చి అందించబోయావు.

"నీకు పుట్టే బిడ్డకు తండ్రి ఎవరు?"

చెయ్యిజారి అతని మీద పడింది.

"యూ బ్రూట్..." లాగి కాలితో నీ పొట్టమీద తన్నాడు

కెవ్వున కేకవేసి కిందపడ్డావు.

లోన పావడా పూర్తిగా ఎర్రబడింది.

** ** **

గుట్టమీద, గర్భగుడికి కుడివైపున పెద్ద కొలను - కొలనులో లోతు తెలియని నీళ్ల - కొబ్బరిముక్కని తింటుంది కుక్క.

కొలనువైపు నడిచావు నీవు.

కొలను చుట్టూ మూడుసార్లు ప్రద...ణం చేశావు. ఆ రోజు కూడా నీ పెనిమిటి చిటికిన వేలును పట్టుకుని మూడుసార్లు అగ్ని చుట్టూ తిరిగావు కదూ.

కొలను అంచున నిలబడ్డావు.

మొదలోంచి తప్పించి కుడిచేతిలోకి తాళిబొట్టును తీసికొని రెండు క్షణాలు దానికేసి చూశావు. నీ బ్రతుకు సముద్రంలో చేపంత స్వేచ్ఛగా అనిపించింది. నీ మనస్సులోకి ఎక్వేరియంలోని బంగారుచేప గుర్తొచ్చింది.

నింపాదిగా తాళిబొట్టుని నీళ్లల్లోకి వదిలావు. నీవు ఒడ్డున నిశ్చల ప్రభాత సమీరంలా నిలుచున్నావు. నీ గదిలోని బంగారు చేప తుది శ్వాస విడిచింది.

తూర్పు సూర్యోదయం అయింది!


వ్యాపారావకాశం

స్వస్థలం నుండి ఎగుమతి ప్రారంభించండి. పెట్టుబడి లేదు. మంచి లాభాలు. వివరములకు దయచేసి వ్రాయండి.

**YOGESH SHARMA**

**K.No. 299**
**Gokalpur**
**Delhi—110 094.**



నవరస నవలా సామ్రాట్
మల్లాది వెంకటకృష్ణమూర్తి
డైరెక్ట్ నవల
మందాకిని




వెల: రూ.20/-
చదివారా?

పెళ్ళయిన వారేకాక,
పెళ్ళికావల్సినవారు
కూడా చదవాల్సిన నవల!

"భర్త అరచేతిలో ఇసకలాంటివాడు. కట్టడి చేద్దామని గుప్పెటమూస్తే, వేళ్ళ మధ్య ఇసకలా జారిపోతాడు."

వ్యసన పరుడయిన భర్తని భార్య ఎలా మార్చగలగడం అన్నది సైంటిఫిక్ చిట్కాలతో, చక్కటి రీజనింగ్స్ ఇస్తూ, రాసిన సైకలాజికల్ నవల మందాకిని!

మీ దగ్గరలో వున్న పుస్తక విక్రేత నడగండి! లేవంటే తెప్పించి పెట్టమనండి. వీలుకాదంటే రూ. 10/- ఎమ్.వో. చేస్తే మిగతా రూ. 10/-లకి వి.పి. పెట్టి పంపుతాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237, రాష్ట్రపతి రోడ్ సికింద్రాబాద్-500003.